సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం ׀ 2 ׀ ఏప్రిల్ ׀ 2023



పుస్తకం.. బాలల ప్రియ నేస్తం

పుస్తకం విలువ చాలా గొప్పది. బాల్యం నుంచి జీవితం చివరి వరకు పుస్తకం మనిషికి మంచి నేస్తంగా ఉపయోగపడుతుంది. -8లో..



హత్య కేసులో నిందితుడి అరెస్ట్

సిద్దవటం మండలంలో జరిగిన మహిళ హత్య కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. -8లో..



ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీస్

బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో శనివారం ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కానిస్టేబుల్ కాపాడారు. -8లో..



రంజాన్ వేళలు

టెన్షన్ పడొద్దు

- పరీక్ష కేంద్రంలో పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వ మార్గదర్శకాలు
- పది విద్యార్థులు, ఇన్విజిలేటర్లుకు వేర్వేరుగా నియమాలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

కడప ఎడ్యుకేషన్: పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిసారి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎన్నో సందేహాలు ఉత్పన్నమవుతుంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వ పరీక్షల విభాగం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలతో కూడిన నియమావళిని హాల్‌టికెట్లపై ముద్రించింది. పరీక్ష కేంద్రంలో చేయాల్సిన, చేయకూడని పనుల తోపాటు ఇన్విజిలేటర్లకు తమ విధులను నిర్దేశిస్తూ సమగ్ర వివరాలు, నిబంధనలతో కూడిన ఇన్‌స్ట్రక్షన్ మ్యాన్యువల్ విడుదల చేసింది.

విద్యార్థులు పాటించాల్సినవి...

హాల్‌టికెట్లలో ముద్రించిన తమ వివరాలు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి. వాటిలో ఏవైనా తప్పులు ఉంటే ముందుగానే తాము చదువుతున్న పాఠశాల హెచ్‌ఎంల ద్వారా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరి చేయించుకోవాలి.

- విద్యార్థులు ఉదయం 8.30 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు కేంద్రంలోకి అనుమతిస్తారు. 9.30 గంటల తర్వాత గేట్లు మూసివేస్తారు. తర్వాత ఎట్టి పరిస్థితులనూ అనుమతించరు.
- పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రంపై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ముద్రితమై ఉంటుంది. హాల్‌టికెట్‌పై ఉన్న ఎన్‌రోల్‌మెంట్ నంబర్ ఆధారంగా పరీక్షా కేంద్రంలో రూములను కేటాయించి దానికి అనుగుణంగానే విద్యార్థులను కూర్చోబెడతారు. బార్ కోడింగ్ విధానంలో రూపొందించిన ఓఎంఆర్ షీట్లను విద్యార్థుల రోల్ నెంబర్ ఆధారంగా పంపిణీ చేస్తారు.దీనిపై అనవసర రాతలు రాయకూడదు. ఓఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ సూచనలు ఇస్తారు వాటిని పాటించాలి.
- పరీక్ష కేంద్రంలో పక్క, పక్కన కూర్చున్న ఏ ఇద్దరికి ఇచ్చే ప్రశ్నపత్రంలో ప్రశ్నలు ఒకే వరుస క్రమంలో ఉండవు. విద్యార్థులు పక్కవారి పేజీలను చూసి సమాధానాలు రాయాలనే ఆలోచన వీడాలి. కాపీయింగ్‌కు పాల్పడినా, జేబులో స్లిప్పులు పెట్టుకుని వచ్చినా పరీక్ష కేంద్రంలో క్షుణంగా తనిఖీ చేస్తారు. పరీక్ష రాసే సమయంలో ఏ విద్యార్థి వద్ద అయినా స్లిప్పులు కనిపిస్తే డీబార్ చేస్తారు.
- ప్రతి విద్యార్థికి 24 పేజీలతో కూడిన అన్సర్ బుక్‌లెట్‌ను ఇచ్చి , అదనంగా పేపర్లు అవసరమైతే మరో 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు.ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లలో ఏ ఒక్క పేజీ చింపినా మాల్ ప్రాక్టీస్‌గా పరిగణించే విధంగా కఠినమైన నిబంధనలు అమలు పరుస్తోంది.
- విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్, పెన్ను, పెన్సిల్, గ్రాఫ్ గీసేందుకు అవసరమైన సామగ్రి పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లవచ్చు.
- సెల్‌ఫోన్, క్యాలికులేటర్, ఎలక్ట్రానిక్స్ వస్తువులను తీసుకురాకూడదు,

ఇన్విజిలేటర్లకు సూచనలు..

- పరీక్ష విధులకు హాజరయ్యే సిబ్బంది తప్పనిసరిగా ఐడీ కార్డులను ధరించాలి.
- బార్‌కోడ్ విధానంపై ఇన్విజిలేటర్లు సంపూర్ణ అవగాహన కలిగిఉండాలి.
- ఇన్విజిలేటర్లు 8.30 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.
- లాటరీలో కేటాయించిన పరీక్ష గదికి సంబంధించిన బ్యాగ్ తీసుకుని రోల్ నంబర్ల ప్రకారం ఓఎంఆర్, 24/12 పేజీల అన్సర్ బుక్‌లెట్స్, స్టాప్లర్ పిన్స్, సీటింగ్ ప్లాన్ అన్ని సరిచూసుకోవాలి.
- 8.45 గంటలకల్లా విద్యార్థులు వారి రోల్ నంబర్ ప్రకారం గదిలో కూర్చొన్నారో లేదా చూడాలి. హాల్ టికెట్‌లోని ఫొటోను విద్యార్థితో పోల్చి చూడాలి.
- 9.30 గంటలకు బెల్ కొట్టగానే గదిలోని మొదటి విద్యార్థి నుంచి క్వశ్చన్ పేపర్‌పై ముద్రించిన వరుస సంఖ్య ప్రకారం, సబ్జెక్టు,మీడియం ప్రకారం అందజేయాలి. గైర్హాజరైన విదార్థి ప్రశ్నపత్రం అతని రోల్ నెంబర్ వద్ద ఉంచాలి. వెనుక వారికి ఇవ్వరాదు.
- 10 గంటలకు ప్రతి రూమ్‌లో మిగిలిన ఆన్సర్ బుక్‌లెట్, ప్రశ్నపత్రం, క్యాన్సిల్ చేసిన ఓఎంఆర్ షీట్స్‌ను తిరిగి ఇవ్వాలి, పరీక్ష రాయని విద్యార్థుల ఓఎంఆర్ షీట్‌పై రెడ్ ఇంక్‌తో క్యాన్సిల్డ్, గర్హాజర్ అని రాసి, మాల్ ప్రాక్టీక్ కేసు అయితే ఆ విద్యార్థి ఓఎంఆర్‌పై క్యాన్సిల్డ్ ఏపీ అని రాసి ఇన్విజిలేటర్ సంతకం చేయాలి.
- రోల్ నంబర్ ప్రకారం సమాధాన పత్రం తీసుకుని ఖాళీల్లో ఇంటు గుర్తుపెట్టి చివర్లో ద ఎండ్ అని రాసి ఇన్విజిలేటర్ పూర్తి సంతకం చేయాలి. చివరిలో ఎటువంటి స్టాంప్ వేయరాదు.

జిల్లాలోని పాఠశాలలు :	589
పరీక్షా కేంద్రాలు:	146
పరీక్షలు రాసే విద్యార్థులు:	27,211
చీఫ్ సూపరింటెండెంట్లు :	146 మంది
డిపార్టుమెంట్ ఆఫీసర్లు:	146 మంది
ఇన్విజిలేటర్లు:	1437 మంది
సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు :	146 మంది
ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు:	07

ప్రభుత్వ నిబంధనలను పాటించాలి



ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్క విద్యార్థి, ఉపాధ్యాయుడు కచ్చితంగా పాటించాలి. ఇందులో ఎలాంటి పొరపాటు జరిగకుండా సీఎస్, డీఓలు పర్యవేక్షించాలి. విద్యార్థులకు ఇన్విజిలేటర్లు సూచనలు ఇవ్వాలి. అవగాహన లేని వారికి అవగాహన కల్పించాలి.పరీక్షలు ప్రశాంతవరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– వై. రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు

ప్రభుత్వం పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపడుతోంది. విద్యార్థులు హాల్ టికెట్‌తో వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాసి వెళ్లేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడమే ధ్యేయంగా గతంలో ఎన్నడూ లేని రీతిలో విస్తృతమైన ఏర్పాట్లు చేస్తోంది. పది పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో ఏర్పాటు చేసిన 146 కేంద్రాల పరిధిలో 27,211 మంది హాజరుకానున్నారు. విద్యార్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను ముందుగానే తల్లిదండ్రులు సందర్శించి పరీక్షలు జరిగే రోజుల్లో సకాలంలో చేరకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలి.

పకడ్బందీగా ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న మోడల్ స్కూల్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని మోడల్ స్కూల్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్, పది పరీక్షల కడప, అన్నమయ్య జిల్లాల అబ్జర్వర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప డీఈఓ కార్యాలయంలో డీఈఓ రాఘవరెడ్డితో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ పది పరీక్షలకు 9, ఓపెన్ ఇంటర్ పరీక్షల కోసం 25 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పది, ఇంటర్‌కు సంబంధించి 8221 మంది విద్యార్థులు పరీక్షలను రాస్తున్నట్లు చెప్పారు. ఉదయం పూట పది రెగ్యులర్ పరీక్షలను, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఓపెన్ పది, ఇంటర్ పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ప్రతి పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌తోపాటు 4 టీమ్స్ ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా పరీక్షలను నిర్వహిణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ పది, ఇంటర్ పరీక్షలు రాసే అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.కార్యక్రమంలో ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డి, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఏడీ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పది పరీక్షల కోసం కంట్రోల్ రూం ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరిగే పదోతరగతి పరీక్షల కోసం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.పరీక్షలకు సంబంధించి సందేహాలుంటే 8309413994 నంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ సేవలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 24 గంటలు అందుబాటులో ఉంటుందని డీఈఓ తెలిపారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత నిరుద్యోగ యువతీయువకులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు శృతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంటర్ హెడ్ ఎస్. యూసుఫ్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కడపనగరం కో ఆపరేటివ్‌కాలనీలోగల తమ సంస్థ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని, అనంతరం అవకాశాన్ని బట్టి ఉపాధి కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 99089 74770, 81060 59836 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సీసీ కెమెరా ఇన్‌స్టలేషన్‌లో..

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సీసీటీవీ కెమెరా ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్‌లో 13 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎస్. నారాయణరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులకు ఈనెల 3వ తేది నుంచి శిక్షణ ప్రారంభం కానుందన్నారు. వివరాలకు 9440905478, 6302833546 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

రిమ్స్‌కు మరిన్ని సీట్లు

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్)లో మొత్తం 14 విభాగాల్లో 72 పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 12 విభాగాల్లో 58 సీట్లు మంజూరయ్యాయి. రేడియేషన్ అంకాలజీ 5 పీజీ సీట్లు, కమ్యూనిటీ మెడిసిన్‌లో 9 పీజీ సీట్లు మంజూరైనట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయని కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ తెలియజేశారు. శనివారం రిమ్స్ ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో రేడియేషన్ అంకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఏ. సుజాత, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ గోపికృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో తెగుళ్ల నివారణ

కడప అగ్రికల్చర్: జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే అగ్రికల్చర్ అసిసెంట్లకు రెండు రోజులుగా జీవన ఎరువులు, జీవన నియంత్రణ పద్ధతుల ద్వారా పురుగులు, తెగుళ్ల నుంచి కాపాడుకునే పద్ధతులపై డిస్ట్రిక్ రీసోర్సు సెంటర్ ద్వారా ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.శనివారంతో శిక్షణ ముగిసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు తెలిపారు. జీవన ఎరువుల వాడకం వల్ల పర్యావరణ పరిరక్షణే కాకుండా తెగుళ్లు నివారించవచ్చాన్నారు. జీవన నియంత్రణ పద్ధతి సమగ్ర సస్యరక్షణలలో ఒక భాగమని,దీనివల్ల పురుగుమందుల ఖర్చు, రసాయన అవశేషాలు లేకుండా నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసుకోవచ్చన్నారు. వీటిలో ట్రైకో డెర్మా విరిడి జీవ శిలీంధ్రనాశిని ముఖ్యమైనదని, దీనిని ఉపయోగించి వేరుశనగ, పసుపు,తదితర పంటల్లో తెగుళ్లను నివారించవచ్చన్నారు. డీడీఏ రమణారెడ్డి, వ్యవసాయాధికారి పద్మావతి, పద్మజ, శివశైలజ పాల్గొన్నారు.

వేణుగానలోలుని గన..
వేయికనులు చాలవులే



వేణుగానాలంకారంలో ఊరేగుతున్న జగదభిరాముడు



కళాకారుల కోలాట ప్రదర్శన

ఒంటిమిట్ట: ఏకశిలానగరిలో శ్రీ కోదండ రామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం రెండరోజు స్వామివారు వేణుగానాలంకారంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఊరేగింపు జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు శ్రీవారి సేవకులు తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ జరిగింది.రాత్రి 7 నుంచి 8:30 గంటల వరకు హంసవాహన సేవ కనులపండువగా సాగింది. రాయంచపై రాములోరు కొలువై మాడ వీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో సాగిన ఊరేగింపులో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కోలాటం బృందం నృత్య ప్రదర్శన, తాళ భజనలు ఆకట్టుకున్నాయి.అంతకుముందు ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆలయంలో కల్యాణవేదిక వద్ద ఉత్సవమూర్తులకు అభిషేకాలు జరిపారు.అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు.

భక్తులకు ఆరోగ్య భద్రత

కడప సిటీ : జిల్లాలో చారిత్రాత్మక ప్రాశస్త్యం గల ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యం కోసం జిల్లా అధికారయంత్రాంగం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు టీటీడీ, జిల్లా అధికారులు సంయుక్తంగా అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారు. ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో ఇప్పటికే జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఈనెల 5న పున్నమి వెన్నెల్లో శ్రీ సీతారాముల కల్యాణోత్సవ ఘట్టాన్ని నిర్వహించనున్నారు. ఈ కల్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు పలువురు రాష్ట్ర స్థాయిప్రముఖులు హాజరు కానున్నారు. లక్షలాది మంది భక్తులు కూడా రానున్న తరుణంలో ఎవరికీ ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పక్కాగా చేస్తున్నారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పలు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు.

ప్రత్యేక శిబిరాలు: బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పది రోజులపాటు దేవస్థాన సమూహ ఆలయాల పరిధిలో మొత్తం 9 ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. రోజుకు రెండు షిఫ్టుల్లో ఒక్కొ వైద్య శిబిరంలో ఒక మెడికల్ ఆఫీసర్‌తోపాటు ఒక సీహెచ్‌ఓ, ఎంఎల్‌హెచ్‌పీ, పీహెచ్‌ఎన్, ఎంపీహెచ్‌ఎస్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు విధులు కేటాయించారు. అనారోగ్య పరిస్థితులు తలెత్తితే తక్షణమే వారిని సమీప ఆస్పత్రులకు తరలించేందుకు 108 అంబులెన్స్ తొమ్మిదింటిని సిద్ధంగా ఉంచనున్నారు.

కల్యాణానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఒంటిమిట్టలో ఈనెల 5న జరిగే సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప నుంచి 45 బస్సులు, పులివెందుల 10, బద్వేలు 20, జమ్మలమడుగు 10, మైదుకూరు 5, ప్రొద్దుటూరు డిపో నుంచి 20, ఇతర రీజియన్ పరిధిలోని డిపోల నుంచి 8 బస్సులు కలిపి మొత్తం 118 బస్సులు నడపనున్నామన్నారు. కడప వైపు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం నుంచి కల్యాణ వేదిక వరకు 4 ఉచిత బస్సులు, రాజంపేట వైపు సాలాబాద్ క్రాస్ పార్కింగ్ స్థలం నుంచి కల్యాణ వేదిక వరకు ఆరు ఉచిత బస్సులు టీటీడీ పర్యవేక్షణలో నడుపుతారన్నారు.

5 నుంచి కమలాపురం ఉరుసు



పోస్టర్లను విడుదల చేస్తున్న ఇస్మాయిల్ తదితరులు

కమలాపురం: కమలాపురం దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా ఉరుసు మహోత్సవాలు ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. వీటిని జయప్రదం చేయాలని పీఠాధిపతి సజ్జాద్–ఏ–నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి సోదరులు, వైఎస్సార్ సీపీ యువ నాయకులు ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. శనివారం దర్గా కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఆయన ఉరుసు ఉత్సవాల పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. 5న నషాన్‌తో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 6న గంధం, 7న ఉరుసు, 8న తహలిల్‌తో ముగుస్తాయన్నారు. రాష్ట్ర హార్టికల్చర్ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి, ఏపీఐఐసీ స్టేట్ డైరెక్టర్ రజనీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్ బాబుల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఇర్ఫాన్, మస్తానయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ జావీద్, ఖాద్రి, నారపురెడ్డి, ఇమామ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూల్యాంకన విధులకు హాజరుకాకపోతే చర్యలు



మాట్లాడుతున్న ఇంటర్ ఆర్ఐవో రమణరాజు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పరీక్ష పేపర్ల మూల్యాంకన విధులకు హాజరుకాకపోతే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని ఇంటర్ ఆర్ఐవో రమణరాజు పేర్కొన్నారు. కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొదటి విడతలో భాగంగా శనివారం తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, సివిక్స్ సబ్జెక్టులకు మూల్యాంకనం ప్రారంభమైంది. ఇందులో ఇంగ్లీష్‌కు 96 మంది, గణితంకు 105, తెలుగుకు 78 మంది, సివిక్స్‌కు 43 మంది అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూల్యాంకన విధులకు హాజరుకాని సిబ్బంది రెండవ రోజు వచ్చేలా చూడాలని ప్రిన్సిపాళ్లకు ఆదేశాలను జారీ చేశామన్నారు. మూల్యాంకన కేంద్రంలో సెల్ ఫోన్లు అనుమతించమన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన నరసారెడ్డి

బద్వేలు అర్బన్ : బద్వేలు – పోరుమామిళ్ల రహదారిలోని శీలంవారిపల్లె సమీపంలో శనివారం కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అట్లూరు మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన మల్లునరసారెడ్డి (48) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మూడేళ్లుగా పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో నివసిస్తున్నాడు. ఓ పని నిమిత్తం తన సమీప బంధువుతో కలిసి వేర్వేరు ద్విచక్ర వాహనాల్లో లక్ష్మీపాలెంకు బయలుదేరారు. శీలంవారిపల్లె సమీపంలోకి రాగానే పోరుమామిళ్ల నుంచి బద్వేలు వైపు వస్తున్న కారు నరసారెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే ఆయన సమీప బంధువు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని సమీప బంధువు చిన్నపరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పుస్తకం.. బాలల ప్రియ నేస్తం

- వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసే.. బాలసాహిత్యం
- 'చదవడం మాకిష్టం'తో ప్రభుత్వ ప్రోత్సాహం
- నేడు బాలల పుస్తక దినోత్సవం



'చదవడం నాకిష్టం'లో భాగంగా గ్రంథాలయంలో కథలు చదువుకుంటున్న బాలలు (ఫైల్)

కడప కల్చరల్ : పుస్తకం విలువ చాలా గొప్పది. బాల్యం నుంచి జీవితం చివరి వరకు పుస్తకం మనిషికి మంచి నేస్తంగా ఉపయోగపడుతుంది. కాలక్రమంలో పుస్తక పఠనం తగ్గిపోయింది. బాలల్లో ఈ లోటును పూర్తి చేసేందుకు ఏటా ఏప్రిల్ 2న అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఏడాది దీన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాల్సి ఉంది. ఆ వివరాలు..

చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు, బుజ్జాయి.. ఇవన్నీ మొన్నమొన్నటి బాలల బొమ్మల పుస్తకాలు. పెద్దలు సైతం ఈ పుస్తకాలను ఇష్టంగా చదివేవారు. జానపద కథలు, సమయస్ఫూర్తి, అపాయంలో ఉపాయం, సాహసయాత్రలు, విశ్లేషణాత్మక కథలు ఇలా ప్రతి నెల ఒక్కో పుస్తకంలో డజనుకు పైగా విభిన్నమైన కథలు మెదడుకు మేతగా ఉండేవి. బేతాళ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, మర్యాద రామన్న కథలు మరుపురానివిగా తరతరాలకు గుర్తిండిపోయాయి. ఆ శీర్షికలు, కథలు తెలుగు వారి మనసులో పదిలమైన చోటు సంపాదించాయి. కాలక్రమంలో ఆ పత్రికలు కనుమరుగయ్యాయి. అవి అందిస్తూ వచ్చిన విలువలు కూడా మాయమయ్యాయి. నాటి పిల్లలు, పెద్దలు జీవితంలో ఎదురయ్యే సమస్యలకు తాము చదివిన కథల నుంచి పరిష్కారాలను వెతుక్కునేవారు. ఆ కథల నుంచి విజయాలను తమ జీవితాలకు అన్వయించుకునేవారు. ప్రస్తుతం ఇదంతా ఓ మంచి జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఈ ప్రభావాన్ని తెలుగులో గుర్తెరిగిన వారు మన జిల్లా వాసులే. ప్రపంచమంతటా పేరుగాంచిన బాలల పత్రిక చందమామను మన జిల్లాకు చెందిన బి.నాగిరెడ్డి చాలా ఏళ్లపాటు అప్రతిహతంగా నిర్వహించారు. ప్రొద్దుటూరుకు చెందిన చదువులబాబు వందలాది బాలల కథలు రాయడంతోపాటు ప్రత్యేకించి బాలల కోసం పలు పుస్తకాలు ప్రచురించారు. జిల్లాకు చెందిన రెడ్డి నాగరాజు బాల సాహిత్యంలో కొత్త ప్రయోగాలతో పుస్తకాలు ప్రచురించారు.

పఠన ఫలితం

మంచి పుస్తకం ఒక మంచి స్నేహితునితో సమానమంటారు. మహా నాయకుల జీవిత చరిత్ర చదవడంతో వారు వ్యక్తిగా ఎదిగేందుకు పడిన కష్టాలు తెలుస్తాయి. నాటి చరిత్ర, సమకాలిన అంశాలు, కష్టాలను ఎదుర్కొనేందుకు వారు అనుసరించిన మార్గం పాఠకుడిని జ్ఞానిగా, గొప్ప వ్యక్తిగా మార్చేవి. జ్ఞాపకశక్తిని, భాషా పరిజ్ఞానాన్ని పెంచేవి. బేతాళ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, మర్యాద రామన్న కథలు వివేచనను, సమయస్ఫూర్తి, నిశిత పరిశీలన శక్తిని పెంచేవి. సింద్‌బాద్, గలీవర్ సాహస యాత్రలు ధైర్య సాహసాలను నింపేవి. జానపద కథలు నాగరికత మూలాలను తెలిపేవి. మంత్ర, తంత్రాల కథలు, భావోద్వేగాల సమతుల్యతను పెంచేవి.

మార్గదర్శనం చేస్తూ...

మంచి పుస్తకాలు మనకు మార్గదర్శిగా నిలుస్తాయి. ఒక మంచి పుస్తకం అవసరమైన సమయంలో పది మంది స్నేహితులు ఇచ్చే అండను ఇస్తుంది. పిల్లల పుస్తకాలు పేరుకే బాలల కోసమైనా పెద్దవారికి సైతం మార్గదర్శనం చేసేవి. మంచి పుస్తకాల ద్వారా బాల్యంలోనే మానవతా, సామాజిక విలువలను నేర్చుకునే వారు. వారిని జీవితాంతం ఆ పుస్తకాలు ప్రభావితం చేసి సమాజంలో ఉత్తమ వ్యక్తిగా గౌరవ మర్యాదలు కల్పించేవి. ఇతర దేశాలలో నేటికీ బాల సాహిత్యానికి ఎంతో ఆదరణ ఉంది. పెద్దలు సైతం బాలల కథలను చదువుతారు. దీంతో చిన్న పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకోగలుగుతున్నారని, ఫలితంగా పిల్లలు, పెద్దల మధ్య అవగాహన, ఆత్మీయత పెరిగి అంతరాలు దూరమవుతున్నాయని పలువురు మేధావుల అధ్యయనాలు తెలుపుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం

బాలల్లో పుస్తకం చదివే అలవాటు క్రమంగా పోతుండడం, దాని వల్ల సామాజిక విలువలకు వారు దూరం అవుతుండడం రాష్ట్ర ప్రభుత్వం గమనించింది. ఈలోటును పూర్తి చేసేందుకే 2022 డిసెంబరు 6వ తేది నుంచి ×చదవడం నాకిష్టం« పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని రూపొందించి అమలు చేస్తోంది. పాఠశాలల బాలలు సమీపంలోని గ్రంథాలయాలకు ఆదివారం ఉదయం వెళ్లి రెండు గంటల పాటు అందులోని బాలల పుస్తకాలు చదివేలా పటిష్టమైన ప్రణాళికలు అమలు చేస్తోంది. ప్రారంభం నుంచి నేటికీ అంటే నాలుగు నెలలపాటు ప్రతి ఆదివారం గ్రంథాలయాలు ఈ పథకం ద్వారా బాలలతో కళకళలాడుతున్నాయి. గ్రంథాలయాల సిబ్బంది కూడా ఎంతో ఉత్సాహంగా ఈ పథకం అమలుకు సహకరిస్తున్నారు. గత మాసం ఈ పథకంలో వైఎస్సార్ జిల్లా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థాయిలో నిలవడం జిల్లాకు గర్వకారణం. భవిష్యత్తులో జిల్లా బాలలు విలువలతో కూడిన సమాజ నిర్మాతలు కాగలరన్న విశ్వాసం మేధావుల్లో వ్యక్తమవుతోంది.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన నరసింహులు

పుల్లంపేట : బైక్ అదుపు తప్పడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మండల పరిధిలోని అప్పారాజుపేట గ్రామానికి చెందిన నరసింహులు (60) శనివారం తన ద్విచక్రవాహనంలో సొంత పని మీద రాజంపేటకు బయల్దేరారు. పుత్తనవారిపల్లి సమీపానికి చేరుకోగానే వాహనం అదుపు తప్పడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పుల్లంపేట ఎస్ఐ సుబ్బారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హెల్మెట్ పెట్టుకుని ఉంటే, ప్రమాద తీవ్రత ఇంత ఉండేది కాదని పోలీసులు పేర్కొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

పెద్దతిప్పసముద్రం : అభం శుభం తెలియని నా బిడ్డ జీవితాన్ని నాశనం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మైనర్ బాలిక తండ్రి ఐసీడీఎస్ అధికారులను వేడుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. కందుకూరుకు చెందిన ఓ మైనర్ బాలిక (14) శుక్రవారం మగబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసారు. ఈ నేపథ్యంలో బి.కొత్తకోట సీహెచ్‌సీలో ఉన్న బాలిక ఆరోగ్య స్థితిగతులపై పోలీసులు, ఓ మహిళా ఎస్ఐ, ఐసీడీఎస్ అధికారులు డాక్టర్లతో చర్చించారు. బిడ్డకు జన్మనిచ్చిన బాలికకు రక్తహీనత సమస్య ఉండటంతో పోలీసుల పర్యవేక్షణలో 108 వాహనం ద్వారా మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడి వివరాలను పోలీసులు సమగ్రంగా సేకరిస్తున్నారు.

యువతిని వేధించిన యువకుడిపై అట్రాసిటీ కేసు

మదనపల్లె : పెళ్లి చేసుకోవాలంటూ యువతిని వేధించిన యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వేధింపులకు గురిచేసినట్లుగా కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటరమణ శనివారం తెలిపారు. పట్టణంలోని బాపూజీపార్కు ప్రాంతానికి చెందిన బిందుప్రియను అమ్మచెరువుమిట్టకు చెందిన ఓ యువకుడు పెళ్లిచేసుకోవాలని ఫోన్‌కు మెసేజ్ పెట్టడంతోపాటు వేధింపులకు గురిచేస్తున్నాడన్నారు. యువతికి వివాహమైనప్పటికీ ఆమె భర్తను బెదిరించి వదిలేసేలా చేయడంతోపాటు రోజూ బ్లాక్‌మెయిల్ చేస్తుండటంతో బిందుప్రియ శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సల అనంతరం కోలుకున్న యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మురళీకృష్ణ ఆదేశాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

తిరువన్నమలైకు ఆరు ప్రత్యేక సర్వీసులు

డిపో	సర్వీసు నంబరు	బస్సులు బయలుదేరు సమయం	చార్జి రానుపోను (రూ.లలో)
కడప	6001 (సూపర్ లగ్జరీ)	8 (రాత్రి)	964
పులివెందుల	59900 (సూపర్‌లగ్జరీ)	7.30 (ఉదయం)	1112
బద్వేలు	6009 (సూపర్ లగ్జరీ)	6.30 (సాయంత్రం)	1122
మైదుకూరు	96786 (సూపర్ లగ్జరీ)	6.30 (ఉదయం)	1280
ప్రొద్దుటూరు	9979 (ఇంద్ర)	5 (సాయంత్రం)	1392
జమ్మలమడుగు	98398 (సూపర్‌లగ్జరీ)	5 (సాయంత్రం)	1238

కడప కోటిరెడ్డిసర్కిల్ : అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం ఈ నెల 5న తిరువన్నమలైకి వివిధ డిపోల నుంచి ఆరు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

- జమ్మలమడుగు డిపోలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి 5.45కు ప్రొద్దుటూరు, 6.30కు ఎర్రగుంట్ల, 7కు కమలాపురం, కడపకు 8 గంటలకు చేరుకుని తిరువన్నమలైకు బయలదేరుతుంది.
- పోరుమామిళ్లలో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి మైదుకూరుకు 6.30 చేరుకుని, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా తిరువన్నమలైకు వెళుతుంది.
- పులివెందులలో ఉదయం 7.30కు బయలుదేరి వేముల, వేంపల్లె మీదుగా తిరువన్నమలైకు వెళ్తుంది.
- పోరుమామిళ్లలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి బద్వేలుకు 6.30, కడప మీదుగా తిరువన్నమలైకు వెళుతుంది.

'కారుణ్య' అభ్యర్థులు సర్టిఫికెట్లతో హాజరు కావాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తూ మృతి చెందిన వారి వారసులు ఉపాధి పొందే నిమిత్తం తగిన సర్టిఫికెట్లతో ఆర్ఎం కార్యాలయంలోని పర్సనల్ ఆఫీసర్‌ను సంప్రదించాలని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప ఆర్టీసీ డిపోలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కడప, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయచోటి డిపోలలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన సిబ్బంది వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించేలా ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారక తిరుమల చొరవతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అర్హతలను బట్టి ముగ్గురిని జూనియర్ అసిస్టెంట్లుగా, 14 మందిని ఆర్టీసీ కానిస్టేబుళ్లుగా, 52 మందిని డ్రైవర్లుగా, 73 మందిని శ్రామిక్, అసిస్టెంట్ మెకానిక్‌లుగా ఎంపిక చేయనున్నామన్నారు. విధుల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు కింది సర్టిఫికెట్లను తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు.

- మరణించిన ఉద్యోగి కుటుంబంలోని ఎవరైనా ఏదైనా పోస్టులో నియామకానికి సిద్ధంగా ఉన్నామని అఫిడవిట్
- ఇతర కుటుంబ సభ్యులకు అభ్యంతరం లేదని నోటరీ చేసిన అఫిడవిట్
- తహసీల్దార్ జారీ చేసిన నో ఎర్నింగ్ మెంబర్ సర్టిఫికెట్ ఉండాలి.
- కుటుంబంలో ఎవరూ కూడా ప్రభుత్వ ఉద్యోగం చేయడం లేదని ధ్రువీకరణపత్రం సమర్పించాలి.
- కుల ధ్రువీకరణపత్రం, ఒరిజినల్ మరణ ధ్రువీకరణపత్రం, తహసీల్దార్ జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్
- విద్యార్హత సర్టిఫికెట్లు

వీటిని తీసుకుని ఆర్ఎం కార్యాలయంలోని పర్సనల్ ఆఫీసర్‌ను సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 9959225773, 94411 92833 నంబర్లను సంప్రదించాలన్నారు.

స్కూటీ డిక్కీలోని రూ.2.86 లక్షలు మాయం

ప్రొద్దుటూరు క్రైం : తన స్కూటీలోని డిక్కీలో ఉంచిన రూ.2.86 లక్షలు గల్లంతైనట్లు 45వ సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరి సి.పవన్‌కుమార్ శుక్రవారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆస్తి పన్నుకు సంబంధించిన రూ.2.86 లక్షలను బ్యాంకులో జమ చేసేందుకు పవన్‌కుమార్ తన స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. అతను మున్సిపల్ కార్యాలయం వద్ద స్కూటీ పెట్టి సహచర ఉద్యోగితో మాట్లాడేందుకు లోపలికి వెళ్లాడు. తర్వాత బయటికి వచ్చి చూసుకోగా డిక్కీలో డబ్బు కనిపించలేదు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో మండల పరిధిలోని తప్పెట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. కడప వైపు నుంచి కమలాపురం వైపు వస్తున్న కారు తప్పెట్ల బ్రిడ్జి వద్ద అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నరేష్, రేణుక, అరుణ్, మురళి గాయపడ్డారు. వారిని చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు రోడ్డుకు అడ్డుగా వుండడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారును పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

మదనపల్లె సిటీ : వేర్వేరు ప్రాంతాల్లో అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరగడంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కురబలకోట మండలం మట్టివారిపల్లె పంచాయతీ రామిగానిపల్లెకు చెందిన బయ్యారెడ్డి(55) అతని అన్న వెంకటరమణారెడ్డి, తమ్ముడు రామ్మూర్తికి మధ్య స్థలం విషయమై గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో బయ్యారెడ్డి ఇంటి చుట్టూ ఫెన్సింగ్ వేసుకుంటుండగా అన్న, తమ్ముడు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగి బయ్యారెడ్డిపై అన్నదమ్ములతోపాటు వదిన సరస్వతి దాడి చేసి కొట్టారు. గాయపడిన బయ్యారెడ్డిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కొత్తవాండ్లపల్లెలో..

పెద్దమండ్యం మండలం వెలిగల్లు పంచాయతీ కొత్తవాండ్లపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి (40)కి ఆయన అన్న రామ్మోహన్‌రెడ్డికి మధ్య కొంత కాలంగా భూముల విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఇది వరకే వీరిద్దరు గొడవపడి స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మళ్లీ కొట్టుకున్నారు. ఈ గొడవలో రామ్మోహన్‌రెడ్డి అతని కుమారులు వెంకటరమణారెడ్డిపై దాడి చేసి చెయ్యి విరగొట్టారు. అతన్ని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

మదనపల్లె సిటీ : ఐదుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రేణిగుంటకు చెందిన రాజ్యలక్ష్మి(30)కి మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టకు చెందిన కృష్ణచైతన్యతో 2015లో వివాహమైంది. కృష్ణచైతన్య బెంగళూరులోని ఓ ప్రైవేటు సంస్థలో ఎగ్జిక్యూటివ్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో వీరు బెంగళూరులో ఉంటున్నారు. ఇటీవల కృష్ణచైతన్య అతని కుటుంబ సభ్యులు రాజ్యలక్ష్మిని అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురి చేయడంతోపాటు ఇంటి నుంచి గెంటివేశారు. దీంతో శనివారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె భర్త కృష్ణచైతన్య, అత్త రామలక్ష్మి, మరిది శివచంద్ర, ఇతని భార్య దివ్య, ఆడపడుచు శారదపై పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



విజేతలకు నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు : శ్రీరామనవమిని పురస్కరించుకుని శనివారం సీనియర్ ఎద్దులకు నిర్వహించిన బల ప్రదర్శన పోటీలు రసవత్తరంగా జరిగాయి. స్థానిక వైఎంఆర్ కాలనీలో శ్రీసీతారామాంజనేయస్వామి దేవస్థాన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన మహమ్మద్ ఆలీ, రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన ప్రసన్నరెడ్డి ఎద్దులు 2534.6 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1,50 లక్షలను మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి అందించారు. ప్రొద్దుటూరు మండలంలోని చౌటపల్లె గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 2437.4 లాగి ద్వితీయ బహుమతి సాధించగా కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి రూ.లక్ష అందించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్‌పల్లికి చెందిన ఎం.నాగయ్య ఎద్దులు 2286 అడుగులు లాగి మూడో బహుమతి సాధించగా ప్రొద్దుటూరు హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి రూ.50 వేలు అందజేశారు. రాజుపాళెం మండలం వెలవలి గ్రామానికి చెందిన రసూల్ ఎద్దులు 1927 అడుగులు లాగడంతో 4వ బహుమతిని కాంట్రాక్టర్ కేసీ పుల్లయ్య సతీమణి కృష్ణవేణి రూ.30 వేలు అందించారు. వీరపునాయునిపల్లె మండలం కీర్తిపల్లెకు చెందిన భరత్‌కుమార్ యాదవ్ ఎద్దులు 5వ బహుమతిని సాధించగా మేస్త్రీ చిన్న దస్తగిరి రూ.20 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, నాయకులు కేశవరెడ్డి, కేకే పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోలీసులు ముందు జాగ్రత్తగా చర్యగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీస్



విలేకరులతో మాట్లాడుతున్న కానిస్టేబుల్ వెంకటరమణ, పక్కనే జిలేఖ

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో శనివారం ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కానిస్టేబుల్ కాపాడారు. ఆమె బ్రహ్మంసాగర్‌లోకి దిగి ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సెల్ఫీ వీడియో తీసుకుంటుండగా.. విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ వెంకటరమణ అడ్డుకున్నాడు. బాధితురాలు, కానిస్టేబుల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేలు పట్టణంలోని దూదేకుల వీధికి చెందిన జిలేఖ కొన్నేళ్లుగా చీటీల వ్యాపారం చేస్తోంది. చీటీలను పాడిన వారు డబ్బు కట్టకపోవడంతో ఇవ్వాల్సిన వారికి డబ్బు ఇవ్వలేక రూ.లక్షల్లో అప్పు చేసింది. పాడిన వారు డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో గత్యంతరం లేక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్లు ఆమె తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో బ్రహ్మంసాగర్‌కు జిలేఖ వచ్చింది. బ్రహ్మంసాగర్ నీటిలోకి దిగి మొబైల్‌లో జిలేఖ సెల్ఫీ తీసుకుంటున్న సమయంలో.. విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ వెంకటరమణ పరిశీలించాడు. వెంటనే ఆయన స్పందించి ఆత్మహత్యను నివారించాడు. అప్పటికే పీకల లోతు నీటిలో మునిగిన ఆమెను రక్షించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చాడు. ఎస్ఐ విద్యాసాగర్‌కు సమాచారం తెలపడంతో ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న మహిళను కాపాడినందుకు కానిస్టేబుల్ వెంకటరమణను ఎస్ఐతోపాటు సీఐ, డీఎస్పీలు అభినందించారు. జిలేఖ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జిలేఖను ఆమె కుటుంబ సభ్యులకు ఎస్ఐ అప్పగించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

సిద్దవటం : మండలంలోని చాముండేశ్వరీపేట గ్రామ సమీపంలో జరిగిన మహిళ హత్య కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. సిద్దవటం పోలీసుస్టేషన్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు వివరాలు వెల్లడించారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె గ్రామానికి చెందిన రాటాల శ్రీనివాసులుకు కడప నగరం అంగడి వీధికి చెందిన జొన్నాదుల జ్యోత్స్న (31)తో 12 ఏళ్ల కిందట వివాహం అయింది. వీరి సంసారం కొంత కాలం అన్యోన్యంగా సాగింది. తర్వాత మనస్పర్థలు ఏర్పడటంతో విడిపోయారు. జ్యోత్స్న హైదరాబాద్‌లో నర్సుగా పని చేస్తుండేది. 2018లో సిద్దవటం మండలం నిర్మలగిరి కాలనీలో ఉండే వాకపల్లి సంతోష్‌కుమార్‌కు ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. వారు అప్పుడప్పుడు చాటింగ్ చేసుకుంటూ.. ఫోన్‌లో మాట్లాడుతూ ప్రేమించుకున్నారు. వివాహేతర సంబంధం కొనసాగించారు. ఈమె ప్రతి నెల వికలాంగుల పింఛన్ కోసం మాధవరం–1కు వచ్చేది. ఆయనకు ఇంకా పెళ్లి కాకపోవడంతో.. తనను చేసుకోవాలని అడుగుతుండేది. 2023 మార్చి 2న హైదరాబాద్ నుంచి పెన్షన్ తీసుకునేందుకు వచ్చింది. అప్పటికే సంతోష్‌కుమార్ తన ఇంట్లో వారిని వేరే ఊరికి పంపించారు. మార్చి 3న రాత్రి ఆ ఇంట్లో వారిద్దరూ కలుసుకున్నారు. తనను వివాహం చేసుకోవాలని ఆమె పట్టుపట్టింది. ఎలా వదిలించుకోవాలనే ఉద్దేశంతో.. ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే మంచం అల్లే నవారు తాడుతో ఆమె గొంతుకు బిగించి ఊపిరాడకుండా చంపేశాడు. ఆమె మృతదేహాన్ని ఒక తెల్లటి సూపర్ సంచిలో పెట్టి మరలా దానిపై దుప్పటి కట్టుకొని తన స్కూటీలో తీసుకుపోయి గ్రామ సమీపంలో ఉన్న పాడుబడ్డ బావిలో పడేశాడు. మృతురాలి మేనమామ చంద్రమౌళి.. జ్యోత్స్న కనిపించడం లేదని మార్చి 8న సిద్దవటం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మార్చి 25న సిద్దవటం మండలం చాముండేశ్వరిపేట గ్రామానికి దగ్గరలోని సెయింట్ ఆంథోని స్కూల్‌కు పక్కన పాడు బడిన బావిలో గుర్తు తెలియని మహిళ శవం ఉన్నట్లు సమాచారం రావడంతో ఆమె బంధువులు వెళ్లి చూసి గుర్తు పట్టారు. ఈ మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తు ముమ్మరం చేశారు. సంతోష్‌కుమార్ బెంగళూరులో ప్రైవేటు కంపెనీలోఉద్యోగం చేస్తుండే వాడు. గ్రామంలో ఏమి జరుగుతుందోనని తెలుసుకోవడానికి అక్కడి నుంచి వచ్చాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారని తెలిసి.. పెద్దపల్లె వీఆర్వో నాని వద్ద శనివారం లొంగిపోయాడు. ఆయన సంతోష్‌కుమార్‌ను పోలీసులకు అప్పజెప్పడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. హత్య కేసును ఛేదించిన కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ తులసీ నాగప్రసాద్, పోలీసులను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు. సమావేశంలో సిద్దవటం ఎస్ఐ తులసీ నాగప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.